# చేపలు

డిశంబరు నెల... వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీలు ఏవేవో పాటలు పాడుతూ సందడిగా తిరుగుతున్నారు. కోతలు కోసేవాళ్లు కోస్తూ, మోసేవాళ్లు మోస్తూ, పంజలు గొట్టే వాళ్లు కొడుతూ – తూర్పారబట్టేవాళ్లు తూర్పారబడుతూ క్షణం తీరిక లేకుండా పనులు చేస్తున్నారు. వరి కోసిన పొలాలల్లో పశువుల కాపర్లు పశువులను అదిలిస్తూ కొండపొడుగు రాగం తీస్తూ ఏవేవో పాటలు పాడుతూ పశువుల మేపుతున్నారు. కొందరు పిల్లలు పొలాలల్లో ఉరుకులు పరుగులు పెడుతూ, పరిగలు ఏరుకుంటున్నారు. ఒడ్డెదమ్మడు ఎలుక పొక్కలు తవ్వుకుంటున్నాడు. షెకేదార్లు ఆడ కూలీలతో పరిహాసాలాడుతూ– మొగ కూలీలను బూతులు తిడుతూ ఒడ్లవెంట అటీటు తిరుగుతున్నారు.... కల్లం దగ్గర దొర గడంచలో కూర్చుండి సిగరెట్టు తాగుతూ ఏదో ఆలోచిస్తున్నాడు. అతని పక్క మోతుబరి రైతు చంద్రయ్య నిలబడి ఎవడిమీదో చాడీలు చెప్పుతున్నాడు....

అలాగా చెరువు కింద వాతావరణం చాలా సందడిగా ఉంది. దాని పేరు పెద్దమ్మ చెరువు– అది రెండు కొండల మధ్య ఊరికి రెండు మైళ్ల దూరంలో వున్నది... దాన్ని ఎప్పుడు ఎవరు తవ్వించారో ఎవరికీ తెలియదు...! నక్కాశాలును అడుగుతే మాత్రం 'ఏనుకటి రాచ్చాసుల...' కథ చెప్పుకొస్తాడు.... ఇంకొకణ్ణడుగుతే రాముడో భీముడో తవ్వించిండంటాడు... దొర "మా తాత కట్ట పోయించిం"దంటాడు.

చెరువుకానుకొని తూరుపువేపు, పడమటివేపు రెండు కొండలు, ఉత్తరంగా కొంత దూరం వెళ్లి అక్కడ అడ్డంగా ఉన్న మరో పెద్ద కొండ రామగిరిని కలుస్తాయి... దానిమీద ఎప్పటివో కోటలు, బురుజులు, తురకల సమాధులు, ఫిరంగులు చాలా వున్నాయి. చెరువుకానుకొని ఉన్న రెండు కొండలు అన్నీ నల్లటి పరుపు బండలే. అక్కడక్కడ బండల నెర్రెల్లో నల్లరేను చెట్లు, పాలకొడిశె చెట్లు – మద్దిచెట్లు– తవిసి చెట్లు ఉన్నాయి... వాటిచుట్టూ సీతాఫలం పొదలు, పరికి పొదలు, బలుసు పొదలు ఉన్నాయి. పడమటివేపు కొండ అంచున వ్యాపించిన పరుపు బండల మీదనే వరి కల్లాలున్నాయి... పొలాలల్లో నుండి బారులుగా కూలీలు కల్లాలవేపు నడుస్తున్నారు.

చెరువులో దక్షిణపువేపు కొండనానుకొని కొంతమేర ఇసుకపర్ర తేలి ఉన్నది. ఇసుక పర్రమీదికంటా తీగెదారు పొదలు పెరిగి ఉన్నాయి. నీళ్లవేపు అడ్డంగా ఒక మద్దిచెట్టు పెరిగి

దాని కొమ్మలు నీళ్లను తాకుతున్నాయి. తీగెదారు పొదల్లో ఇద్దరు వ్యక్తులు కూర్చున్నారు. వాల్లముందు నాలుగైదు గాలం కొయ్యలున్నాయి. నీళ్లలో తెల్లగా తేలుతున్న నెమలీక గాలపుబెండ్లు టకటక కిందికీ మీదికీ కొట్టుకుంటున్నాయి. ఇద్దరిలో ఒకడు ముసలివానిగా కనిపిస్తున్నాడు. కానీ నిజానికి అతడు ముసలివాడు కాదు... అతని పేరు నక్కాశాలు...

నక్కాశాలు నక్కలా వంగిపోయి ఉంటాడు... ఎముకలు పొడుచుకొచ్చిన భుజాలు కనిపించే చిరిగిన గుడ్డబనీను తొడుక్కున్నాడు. బాగా మాసిపోయిన గుడ్డ ముక్కొకటి నెత్తికి చుట్టుకున్నాడు- ఆ గుడ్డ ముక్కలో ఎప్పుడో తాగి ఆర్పేసిన మొక్కి చుట్టొకటి చెక్కుకున్నాడు. మనిషి పుల్లలా ఎండిపోయిన మామిడి పిక్కలాగున్నాడు. దవడ ఎముకలు వికృతంగా పొడుచుకువచ్చాయి.... చప్పిడి దవడల మధ్య నోరు... ఎండిన పెదిమల లోపల పొగాకు నమలడం వలన గారపట్టిన పళ్లు. అక్కడో పోస, ఇక్కడో పోస పెరిగిన పిల్లిగడ్డం, ఎండిపోయిన బావుల్లాంటి కళ్లు... చూపులు నక్కచూపుల్లా గాలం బెండుమీదున్నాయి.

రెండవవాడు ఇంకా పసితనంపోని పిల్లవాడు. పిల్లవాడు మాగిన కుండతీరు నల్లగా ఉన్నాడు. తాటిపండులాంటి గుండుమీద చిన్న జుట్టు. చిరిగిన లాగు తప్ప ఒంటిమీద మరేం లేదు... పేరు శంకరి... పదేపదే లేచి నిలబడి లాగు ఊడిపోతూ ఉంటే లాగు వడిపెట్టి మొలదారం కింద దోపుకొని మల్లీ కూర్చుంటున్నాడు. బెండు మునగకముందే గాలం పైకి ఇగ్గుతున్నాడు.... మల్లీ ఏదో తిడుతూ గాలం నీళ్లలో వేస్తున్నాడు....

"పిలడా! సాపలంత తెలివి తక్కువయిగాదు. తుక్కు జిమ్మలు గాలంనుట్టు ముసురుత్నట్టున్నయ్... ఏది 'పేటి' కొంచెం ఎక్కువిడువు. లోతు నీళ్లల్లయితే తుక్కుజిమ్మల బాదుండది... ఇంటున్నవా?" నక్కాశాలు....

"నీయక్క తుక్కుజిమ్మల కసపిస నముల్త, ఏమనుకుంటన్నయో? ఎర్ర గొరికి గాలం ఉత్తయి జేత్తన్నయ్."

"ఒరే తుత్తు బుడతడా? గట్లేగిరిపడ్తె సాపలు పడ్తయా? ఒడుపు దెలువాలె" నక్కాశాలు పండ్లు బిగపట్టి గాలం గుంజిండు. గండెపరుక తెల్లగ పైకొచ్చింది...

"సూసినవా? గీ గండె పరుక గాలం సూసిందంటె కాసేపు సయ్యాటలాడ్తది... బెండు బుడువుంగ తీర్గ మునిగి తేల్తది... సయ్యిన గుంజినవనుకో మళ్ల గాలం కాడికి రాదు..." నక్కాశాలు గండెపరుక గురించి చెప్పుకపోతున్నాడు.

పడమటివేపు సూర్యుడు చెరువులో తానమాడుతున్నాడు.... చెరువు నీళ్లమీది నుండి చల్లగా గాలి తోలుతోంది... చెరువులో తెల్లగా అలలు కదులుతున్నాయి.... కొండ అంచుకు తాకి కిలకిల నవ్వుతూ అలలు వెనుకకు తిరిగిపోతున్నాయి. ఎక్కడో పొదల్లో అడివికోడి అదేపనిగా కూస్తోంది.... ఇసుకపర్రమీద ఏవో పక్షులు చేరి నీల్లబందుకు జలకాలాడుతున్నాయి. ఎదురు కొండమీద ఏదో పక్షి ఎగురుతోంది. నల్లరేను చెట్టుమీద నాలుగు కోతులు కిచకిచమంటూ

సరసాలాడుతున్నాయి. ఒకటీ అర చందమామ చేపలు నీళ్లమీద ఎగురుతున్నాయి... కలువ మొగ్గలు గాలికి తలలూపుతున్నాయి.... పిల్లవాడు పులకించిపోయి ఏదో పాట ఎత్తుకోవడానికి రాగం తీశాడు... అడివిపూల పరిమళం గాలిలో తేలుతోంది.

"హుష్... సప్పుడు సేయవద్దు...."

"నాకు బయమైతందే సిన్నాయినా..." శంకరి గునిసింది.

"గందుకనే నిన్ను రావద్దన్న- ఒరే సుప్పనాతి శంకరిగా! పాటలు పాడ్తె సాపలు బడ్తాయిరా? అదిగాక ఎవడన్న ఇంటె కొంపమునుగుద్ది.... ఈపు జమిడికె మోతలు మోగుద్ది- ఈపు మోగుతె అదేపాయె- వారీ! నాకయితె నాత్రికి కూడుండది - గప్పుడు సూస్కో కడుపుల పేగులు సొన్నాయిలు తమ్ముల్లు..." ఆశాలు పెదిమలు బిగబట్టి "దా...దా... బిడ్డా! దా... నువ్వు బుడుగలిచ్చినప్పుడే అనుకున్న" గాలాన్ని సుతారంగా పైకి లాగాడు....మాల పంకిడిగాడు లివ్వర లివ్వర కొట్టుకుంటూ బయటకొచ్చింది. దాన్ని సుతారంగా గాలం ముల్కినుండి ఊడదీసి తుంగపోస గుజికి గుచ్చి- గాలం ఎర్రను సరిచేసి దానిమీద ఉమ్మేసి మళ్లీ నీళ్లల్లోకి విసిరాడు.

"సెరువు అలుగుల్లకని తీసుకచ్చి- గీ అడివిలకు దెత్తివి?"... శంకరయ్య....

"దుత్తెరి ఏంబయంరా? మనుషులకు బయపడాలె- ఎందుకంటె ఆడెనుక తీపులు దీత్తడు. గీడేమున్నదనిరా బయ్యం...? శంకరీ గీ మాలపంకిడిగాడున్నడు గదా! దీని పులుసు నువుదిన- ఉత్తబోలా! మన బామని దొరతీర్గ- ఇన్నావురా? ఎనుకచ్చేటియి ముందటచ్చేటియి తెల్వదు... ఎర్ర గన్పిచ్చిందో సంబురంగ బుడుగలిచ్చి లటుక్కున మింగి కూసుంటది. బస్! గంతే మన గుజిల బడ్డదనుకో? ఉత్త ఆశగొట్టు- ఆశ ఆరుపాల్లు- దరిద్రం మూడుపాల్లు. మన బామని దొరో? ఎవనిదన్న భూమి కన్పడ్డదా? లటుక్కున మింగుదామనుకుంటడు. అన్ని మింగెటోడు పెద్దొర.... అడ్డని నెత్తి బుదుతడు కొడ్తె బుడుతని నెత్తి బోడోడు గొడ్తడట- మన పెద్దొర బట్టతలోడే గదా! ఆడు ఈని నెత్తి గొరుగుతడు... సప్పుడు సెయ్యకుంట మింగి కూసుంటడు. ఆడు బొమ్మశాపసొంటోడు! ముంగటికి ఏ శాపచ్చినా మింగేత్తడు. మజ్జెల బదునాం ఎవడు? బామని దొరే! తడుక దీసినోడెవడు? మాలపంకిడిగాడు- దొర దొరతీర్గనే ఉంటాడు. పట్వారిగాడు బదునామయిపోతడు. కని గిది నీళ్లల్ల పట్టబోతమా! సత్తె దొరుకది. బామనోడు లెక్కల గట్లనే- సిక్కు రాతలు రాత్తే పెద్దోడు ధంగయి పోవాలె. నా ఎర్ర సెలుక గట్లనే గంగల గల్పిండు- ఆడు దిన్నడా? ఆనినోట్లె మన్నుబోసి దొరే ఇగ్గుకున్నడు...." నక్కాశాలు చెప్పుకపోతున్నాడు.

పిల్లవానికి ఈ వ్యాజ్యాల విషయం ఏమంత ఆసక్తిగా లేదు. చేపలు కూడా గాలానికి పడటం లేదు. మనసు ఎక్కడో వరి పొలాలల్లో గెంతుతున్నది. అక్కడయితే ఎండ్రికిచ్చలు పట్టచ్చు. ఊరు పేరులేని పాటలు పాడొచ్చు. పరిగేరుకోవచ్చు.... ఆఖరుకు తూము మీదికెక్కి చెరువులో దూకి ఈతలు కొట్టవచ్చు. ఇదేదీ కాకున్నా కాలువ వెంట జిమ్మలు పట్టవచ్చు. ఇక్కడో- మాట్లాడకుండా కనీసం చెయ్యి కాలు కదుపకుండా- ఒక్క దగ్గర కూర్చోవాలంటే

కట్టేసినట్టు గున్నది- తను నిన్నమొన్న నేర్చుకున్న పాటలు గొంతులో పోటెత్తుతున్నాయి.... కాని, ఈ గాలపు చేపలు తీసుకవెళ్లకుంటే అయ్య తంతడు... తను వొదిగి గుడిసె మూలకు చేరుకుంటే తిడ్తడు... ఆ తరువాత అవ్వ ఏదో అంటుంది. అవ్వను తంతడు. ఏడుపులు పెడబొబ్బలు... అయ్యదగ్గర ఏదో వాసన వస్తుంటది... పిల్లవాడు తండ్రి గుర్తుకు రాగానే గజగజ వనికి పోయిండు...

"శంకరీ! నువ్వేం బయపడకు... బయం మంచిదిగాదు... నా బతుకంత గీ బయంతోనే ఆకుకు అందకుంట పోకకు పొందకుంటయి పోయింది. ఇన్నావు బిడ్డా! మీ అయ్య లఫంగ-తాగుబోతు నాకొడుకు. నాకూ అన్పిత్తదిరా తాగాల్నని.... తాగినోడు అదురుట్టవంతుడు. ఆనికి ఏదేవి పోతుండది... బిడ్డా! నువ్వింక సిన్నోనివి. లోకం సంగతి ఎరిగినోనివికావు- అయ్యగొడ్తె ఏడుత్తవు- ఏడ్సేడ్సి ఎన్నో కుక్కతీర్గ మలుసుక పండి గుఱ్రుకొడ్తవు. అవ్వ ఏనాత్రో లేసి ఇంతకూడు బెడ్తె ఏనాత్రో కుక్కతీర్గ తింటవు. కని శంకరీ! నా కడుపుల పుట్టెడు సొదున్నా ఏడువలేనే? ఏడ్సేటందుకు ఏం మిగిలింది నా లంజెపియి?... నా కడుపుల ఎన్నేండ్ల దుక్కమో పేరుకు పోయిందిరా! పొద్దుగూకే దనుక గిట్ల ఎన్నో కొట్టిపోసుకుని గుడిశెకు బోతేమున్నది? మీ సిన్నవ్వను పంతరగడు సెందురడుంచుకునె- నాకేం మిగిలింది బిడ్డా! గుడిశెల గడుకెనుల సిప్ప...నాత్రి ఎంత కొట్టిపోసుకున్నా కంటిమీనికి కునుకురాదు...."

"నువ్వే పాడోనివి. ఎల్లవ్వ సిన్నే మంచిది" శంకరయ్య...

"నేను కాదన్ననా బిడ్డా! మనుషులంతా మంచోళ్లే. గ నమ్మికతోనే బతుకుతున్న...కని మనిషెనుకున్న సొమ్ము ఆన్ని కుక్కనుజేసి ఆడిత్తది. మీ సిన్ని పదేండ్లు నాతోనుండ లేదా? ఏమంట గసెందురుగాని కన్నుబడ్డదో! దాన్నెత్తుకపోయిండు... భూములు గుంజుకోంగ ఏమన్న! ఎడ్లెవుసం గుంజుకోంగ ఏమన్న- ఏమన్ననో ఏమనలేదో నా మనుసుకెరుక... ఒంటిగాని సేత ఇంటికిరాదట... మీ సిన్ని నెత్తుక పోయిన్నాడు ఆని గొంటికె పిసికేత్తామనుకున్న- కని ఆడెవడు మోతెపరి రైతు! ఆనెనుకెవలున్నరు? పెద్దొర!... ఊళ్లె పెద్దమనిషి. పంచాతులు పడావులు దెంపెటోడు ఆడే... నా మనుసుల గీ ఇసారం ఆనికి తెలిసిపోద్ది- రెండో కంటికి దెల్వకుంట నక్కాశన్ని బొంద బెట్టిత్తడు. నక్కాశడు గట్లెందుకు సత్తడు? నేను సత్తె నా కోసం ఎవడేడుత్తడు? నువ్వేడుత్తావ్ బిడ్డా?" ఆశాలు పెదిమలు ఎందుకో వణికాయి.

"సిన్ని మా ఏడుత్తది. నాతోని గనాడు నీకు మెతుకుల బువ్వ పంపలే?"

"ఔ బిడ్డా! అది సీతమ్మొరిలెక్క సెరలసిక్కింది. గసెర ఇడిపియ్యాల్నంటె నేను రాములవార్ని గాదుగదా! గందుకనే గాని దగ్గరుండిపోయింది. కని బిడ్డా ఆన్ని..." ఆశాలు గాలం విసురుగా పైకి తీసిండు. ఈసారి గాలం వెంట జెల్లవచ్చింది...

"గీ జెల్ల సుత ఉత్తగనే పడ్తదిగదా!" శంకరయ్య మాట మార్చాడు.

"ఔ బిడ్డా గిది మీ సిన్ని అసొంటిది- తెల్లగ ఎట్లున్నదో సూడు! సక్కదనముంటేం లాభం అయిమూల లెరికలేందీ? లోకం సంగతి ఎరిక జేసుకోకుంటె గిట్లనే ఎవడో గాలమిసురుతడు..." ఆశాలు చెప్పుకుపోతున్నాడు.

"ఇయ్యల్ల నాకు సాపలు పడ్తలేవ్- మా అయ్య ఈబ్బలుగొడుతడు..." శంకరయ్య బెదురుగా చూశాడు.

"నా తండ్రీ! నేను... నిన్ను గొడ్తంటే సూత్తానురా! నేనిన్ని సాపలిత్త. సరేనా?"

శంకరయ్య "సరే" అన్నాడు.

ఇంతలోనే చెరువు కట్టకింది పొలాల్లోనుండి పెద్దగా అరుపులు వినిపించాయి. నక్కాశాలు నక్కలా ముడుచుకపోయి వంగి వంగి నడుస్తూ కొండరాయి మీదికి పాకి నుదురుకు చెయ్యడ్డం పెట్టుకొని దూరంగా చూశాడు. "వీనమ్మల కుక్కలు దెం... లంజ కొడుకులు పొద్దుందాక చేపిచ్చుకొంటరు. కైకిల్లిచ్చేకాడ తకురారు బెడ్తరు. కడుపు మండినోళ్లు ఊకుంటరా? ఉహ్వా! కొడుకు లాలా ఎనుకటి కాలంగాదు... తవ్విచ్చి తంగెళ్లు బీకిచ్చుకోను..." గొనుగుతూ వెనుకకు తిరిగొచ్చాడు.

అప్పటికి పొద్దు పూర్తిగా వాలిపోయింది.

"ఏమయ్యిందే?"... శంకరయ్య.

ఆశాలు ఏదో ఆలోచిస్తూ, గొణుగుతూ, తుప్పతుప్ప వూస్తూ శంకరయ్య మాట విన్పించుకోలేదు.

"నేను సుత సూసత్త..." శంకరయ్య లేచి నిలబడినాడు.

"అద్దద్దు... గీడ మనమున్నమని ఎరికయ్యిదంటే సెందురు గాడురికత్తడు... సెరువు ఆడు గుత్తగొన్నట్టు తిడుతడు... వాని పంతరగడు నోట్లె... తన్నినా తంతడు... తన్నుతే ఆని పాపాన ఆడే పోతడుగని మన కడుపుమీన గొడ్తే- గీన్ని శాపలు గుంజుకుంటె- రేపు గీయాల్లదనుక ఒక్కపొద్దే..."

"నీ యవ్వ... నాకు శాపలద్దు ఏమద్దు..." శంకరయ్య గునిసిండు.

"ఇగరారా, నీతోని సావచ్చిందే!... ఏం బుట్టిందిర నీకియల్ల కుదురుగ కూసుంటలెవ్? మొయ్యశాపతీర్గ ఉరుకులాడ్తన్నవ్. అవు బిడ్డా! ఎవడాగుతడు, ఎంతకనాగుతడు? పాపం బరపూర నిండినంక- గలొల్లెందో ఎరికేనారా! సంఘపోలచ్చిండ్లు- కూల్లు ఎక్కువియ్యి మంటండాలె- ఇయ్యద్దు... కంట్లె కనుపాపల తీర్గ వానవ్వల కుక్కల్ దెం.... ఆళ్ల పొలాలు సాది సవరచ్చెన జెయ్యాలె. దున్నిదోకి గుమ్ములు నింపినోళ్ల ఆకట సావాల్నా! మనకు మంచి బూముండ పాపమేనాయె... నేనెందుకు గీ దొంగ శాపలు బట్టి బతుకుతు? నా బూమిల నేను బంగారం పండిచ్చుకుందు- గిదే సెర్వెనుక సీతమ్మ మిట్ట నీకెరికేనా? అట్టి శాపలు గాల్సుక తినేమొకమా, గదినాదే... గదాని రైనుబెట్టుకొని మా ఎల్లికి కడుపుబోయినప్పుడు సెందురుగాడిచ్చిండు అప్పు.

ఆడెంత రాసుకున్నడో ఎవనికెరుక? అడ్డీకడ్డి గట్టి ఊడలాక్కున్నడు. అయిందా! ఆడికి తెల్లారిందా! ఆడికి సేతికయికిలన్న సేసి బతుకుత మనుకుంటె నా తోడును గుంజుకున్నడు. వారీ శంకరీ ఇక నా కడుపు మసలదా? నువ్వే సెప్పు...."

గీ సంగపోల్లు మనూల్లెకచ్చినంక నాకైతె గుఱ్ఱానెక్కినంత ఖుషామతుగున్నది. పిలడా! నువ్వు గ పదాలినలే 'సుత్తి మనది - కత్తి మనది - పార మనది - పలుగు మనది - దొర ఏందిరో?'- కని బిడ్డా అందరొక్కటిగావాలె... మనకు కడుపోటి కాలిపోయింది. కడుపు తిప్పలకు మనోల్లు ఆళ్ల గులాంగిరి సేత్తరు. మీ అయ్యనే సూడు- ఊరంత ఊరుపట్టయితే దాసరోడు తాళ్లపట్టన్నట్టు. ఆడు పెద్దొరకింద కుక్క బతుకు బతుకుతండు. మనిషి తాగకుంటె మంచోడె- కని ఆడు తాగకుంటె మనిషి కాడు. ఆనికెర్కలేదా పెద్దొర సంగతి?... ఆనియి బూములు గంగలకల్సి పోలేదా? మీ అవ్వమీన బామనోడు... ఆడే... నాలెముచ్చు పట్వారిగాడు సెయ్యేసిండని ఎవలకు జెప్పుకోవాలె? పెద్దొర అంతకు పచ్చి లంగ... కిందకుండ కిందుండంగనే మీని కుండ మీనుండంగనే నడిమి కుండ తప్పతీసెటోడు. నీ కెందుకు లేరా గియ్యన్ని ముచ్చట్లు! మేం సావుబతుకులు బతికినం కని గీ బతుకు గిప్పుడు మార్తదంటండ్లు సంగపోల్లు! మారకుంటేమయితది...? నాకేమున్నది లంజెపియి పోయేటందుకు? మరి నేనెందుకు బయపడ్తన్న?... ఒక్కన్నని! అందరం గూడితె టుప్పా!..." ఆశాలు కండ్లు మెరుస్తుండగా చెప్పుతున్నాడు. హఠాత్తుగా చెప్పడమాపి గాలం కొయ్య లేపిండు. ముల్కికి మళ్లీ ఎఱ్ఱగుచ్చి నీళ్లల్లో వేసి తలగుడ్డలో చెక్కుకున్న మొక్కి చుట్టతీసి నోట్లో పెట్టుకొని పక్క జేబులో నుండి చెకుముకి సంచి తీసి కసిగా నిప్పుకొట్టి చుట్ట ముట్టిచ్చుకున్నాడు.

అంతకంతకు అలజడి పెద్దదయ్యింది. ఆశాలు భయం భయంగా గాలాలు తీసి దారాలు కొయ్యలకు చుట్టిండు. శంకరయ్య అదేపని చేసిండు. చేపల గుజి ఎడంచేత పట్టుకొని శంకరయ్యను కుడిచేత జబ్బపట్టుకొని పరుపు బండలమీదికి లాక్కుపోయిండు.

అక్కన్నుంచి పెద్దొర వరికల్లం స్పష్టంగా కనిపిస్తోంది.... వరికల్లంలో కూలీలు బారులుగా నిలుచున్నారు. ఆడోల్లు చేతులూరుస్తూ తిరుగుతున్నారు. శంకరయ్య తండ్రి పెద్ద కఱ్ఱ అడ్డం పెట్టి వాళ్లను తోస్తున్నాడు. పెద్దొర కొంచెం ఎత్తుబండ మీదికెక్కి చెయ్యెత్తి తిడుతున్నాడు. ఆ తిట్లు స్పష్టంగా విన్పించడం లేదు.... పట్వారి కాసేపు దొర దగ్గరికి, కాసేపు కూలోల్ల మీదికి ఉరుకులు పరుగులు పెడుతున్నాడు.... దొరకు ఎడంవేపు చంద్రయ్య నిలబడి గాలిలో కఱ్ఱ తిప్పుతున్నాడు... అతని వెనుక కఱ్ఱలతో దొర మనుషులు నిలబడి ఉన్నారు....

ఏమయ్యిందో ఏమో, దొర మనుషులు కూలివాళ్లమీద పడి కొడుతున్నారు... కూలోళ్లు రెచ్చిపోయారు... ఎవరినెవరు కొడుతున్నారో తెలియకుంటయ్యింది... మొగ కూలీలు దొర మనుషులను వెంటబడి తరుముతున్నారు. స్త్రీలు వడ్లు కొంగుల కెత్తుకుంటున్నారు.

శంకరయ్య భయంగా నక్కాశాలును కౌగలించుకున్నాడు. ఆశాలు కండ్లెందుకో మండుతున్నాయి. దవడ ఎముకట్లు కదులుతున్నాయి.... అంతూపొంతూ లేకుండా తిడుతున్నాడు. మరి కొంత సేపటికి లొల్లి తగ్గింది. ఎవడో వరి కుప్పెక్కి ఏదో చెప్పుతున్నాడు. ఆ గుంపులో దొర లేడు - దొర మనుషులు లేరు. కొందరు పొలాలల్లో గట్లవెంట పరుగెత్తుతున్నారు....

"నక్కాశిగా... లంజకొడుకా..." ఆశాలు వెనుక నుండి పిడుగు పడ్డట్టుగా విన్పించింది. ఆశాలు చేతిలోని చేపల గుజి కిందబడి చేపలు బండలమీద చెల్లాచెదరుగా పాకుతున్నాయి. గాలపు కొయ్యలు కింద పడిపోయాయి.

ఆశాలు వెనుదిరుగుదామనేటాల్లకే ముడ్డిమీద తన్ను - అతి కష్టంగా పడబోయి తమాయించుకుని వెనుదిరిగి చూశాడు.

ఎదురుగా నిలివెడెత్తు చంద్రయ్య... అతని నుదురు చిట్లి నెత్తురు కారుతున్నది.... తెల్లటి అంగీ చిరిగి ఉన్నది.... కళ్లు చింతనిప్పుల్లా మండుతున్నాయి. రుమాలు లేని బోడినెత్తి.... చేతిలో కఱ్ఱ... సాక్షాత్తు యముని సద్దకుని తీరు నిలబడ్డడు. ఇందాకటి గలాటలో తన్నులు తిని పారిపోయి ఎటూ తోచక ఇటు పరుగెత్తుకొచ్చాడు... ఇక్కడ నక్కాశాలు కన్పించిండు.. ఆ కోపంతోనే నక్కాశాలును తన్నిండు....

"నీ బాంచెన్.. గిప్పుడే అచ్చిన...." ఆశాలు నిలువెల్లా వణికిపోతున్నాడు. పిల్లవాడు ఎటూ తోచక సన్నగా, భయం భయంగా ఏడుస్తున్నాడు.

"నీ పెంఢ్లాన్ని.... దొంగలంజ కొడుకులాలా! మీ అంతం కండ్లజూత్త... ఏకుమేకయి పోయింది. బంచత్... సెరువుల శాపలు ఎవల సొమ్మనుకున్నావ్?" చేతిలోని కఱ్ఱతో ఆశాలును కోపంగా కొట్టసాగిండు.

ఆశాలు దెబ్బలు తప్పించుకోను వంగుతూ ఉంటే దెబ్బ ఇంకా బలంగా తాకి, నుదురు చిట్లి రక్తం సొడసొడ కారసాగింది.

చంద్రయ్య, ఆశాలు నుదుటి రక్తం చూసి కొట్టడమాపాడు.

"శాపలు గుజికుచ్చు మాదెర్‌సోదు... ఇటియ్యి" చంద్రయ్య హుకుం.

ఆశాలు వణుకుతూ అట్లాగే చేశాడు. అప్పటికి సూర్యుడు పూర్తిగా కుంకాడు... పడమటి వేపు ఆశాలు నెత్తురు కారుతున్న నుదురు తీరుగా ఎఱ్ఱడాలు...

చంద్రయ్య నుదురుకు చెయ్యడ్డం పెట్టి వరికల్లాలవేపు చూశాడు. కల్లాలల్లో మొండి వరికుప్పలు తప్ప జనం లేరు. ధాన్యం రాసులు లేవు.

"వీనమ్మల కుక్కల్ దెం... లంజకొడుకులు తెగిచ్చిండ్లు... లమ్డికొడుకులు, తొండ ముదిరి ఊసరెల్లి కాకముందే, పోలీసు ఠానాకు అప్పజెప్పాల్నయ్యా అంటే దొర వింటేనా? వీనమ్మల అంతుదేలుత్త. సెంద్రయ్యంటే ఏమనుకున్నారో!" అట్లా గొనుగుతూ, బూతులు తిడుతూ, పెద్ద పెద్ద జంగలేస్తూ చంద్రయ్య వెళ్లిపోయాడు.

"మనం పోదామా?" శంకరయ్య భయం భయంగా అడిగాడు....

నక్కాశాలు నక్కలా ముడుచుకుని చాలాసేపు కూర్చున్నాడు విరాగిలా... కండ్లు పొడుచుకొచ్చాయి... ఎందుకో అతని పెదిమలు వణుకుతున్నాయి.... "బిడ్డా! సూసినవా గిదీ రాజ్జెం!... ఏడికి బోదాం... నీకైతే అవ్వయ్యున్నదు, నా్రతింత కూడు బెడతరు, నాకెవలున్నరు?" ఆశాలు కంఠం వణికింది....

"సంగపోల్లు ఉన్నరంటివి గద!..." శంకరయ్యకు ఇక్కడి నుండి ఎప్పుడు వెళ్లిపోదామా అని ఉన్నది....

ఆశాలు మాట్లాడకుండా గాలం కొయ్యలు తీసుకున్నాడు. నలుమూలలా చీకటి వ్యాపిస్తుండగా శంకరయ్య ముందూ ఆశాలు వెనుక నడుస్తూ చెరువుకట్ట దిగారు.... తీతువ పిట్టొకటి కొండ అంచున బెదిరి బెదిరి అరిచింది..

❖ ❖ ❖

ఎవరో ఝాడిచ్చి చెంపమీద కొట్టినట్టు శంకరయ్య లేచి కూర్చున్నాడు. ఎండపొడ కండ్లమీద పడ్తుంది... ఊళ్లో ఎవరో చచ్చినట్లు ఏడుపులు, మొత్తుకోళ్లు, తిట్లు... ఉరుకులూ పరుగులూ కండ్లు నులుముకుంటూనే గుడిశె బయటకొచ్చాడు. ఊరు ఊరంతా తొక్కిసలాటలో ఉన్నది. ఎందుకో చాలా మంది అటిటు ఉరుకుతున్నారు. కాకి బట్టలేసుకున్న ఎ్రర టోపీల మనుషులు లాఠీలతో కొడుతూ వాళ్లవెంట ఉరుకుతున్నారు.... చేటలు, కుండలు, అంచెలు, పాత బట్టలు బజార్లో కొందరు కాకి బట్టలోళ్లు తెచ్చి పారేస్తున్నారు. నిన్నటి రోజు దొర కల్లంల నుంచి తెచ్చుకున్న వడ్లు బజార్లో పారబోస్తున్నారు. మూడు బజార్ల దగ్గర పాలపిట్ట రంగు మోటార్లున్నాయి. పట్టుకున్నవాళ్లను గింజుకుంటున్నా కూడా విడువక ఆ మోటార్లలోకి తోస్తున్నారు...

పిల్లవాడి నిదుర చెదిరిపోయింది. కానీ పరిస్థితి ఏమిటో అర్థం కాలేదు.

నక్కాశాలును ఇద్దరు కాకి బట్టలోళ్లు చెరో రెక్క పట్టుకొని గొరగొర ఈడ్చుకు పోతున్నారు.... అతను పిట్టలా నోరు తెరిచి ఏదో తిడుతున్నాడు... ఎటూ తోచక తనకు తెలియకుండానే వాళ్లవెంట శంకరయ్య పరుగెత్తాడు.

మోటార్ల దగ్గర తిట్లు... ఏడుపులు... అందులో స్త్రీలు కూడా ఉన్నారు. విచి్రతం తన తల్లి కూడా అందులో ఉన్నది. ఆమె రవికె చిరిగున్నది– వెం్రటుకలు ఊడి ఆమె ముఖం కప్పేశాయి. ఆశాలును కూడా కాకి బట్టలోళ్లు మోటార్లో పడతోశారు.

శంకరయ్య ఏడుస్తూ తల్లి ఉన్న వ్యాను ఎక్కబోయాడు. తల్లి ఆందోళనగా వారిస్తోంది. – ఎక్కణ్నుంచి వచ్చాడో ఒక కాకి బట్టలోడు లాఠీతో శంకరయ్య వీపుమీద పొడిచాడు. శంకరయ్య కూలబడిపోయాడు.

వ్యాన్లు దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయాయి. ఆశాలు పండ్లు కొరుకుతూ శంకరయ్య వేపు చెయ్యూపుతూ వెళ్లిపోయాడు....

శంకరయ్య రెండు పిడికిళ్లలోకి మట్టి తీసుకున్నాడు. కోపంతో దుఃఖంతో అతని ముఖం ఎర్రబారిపోయింది.... బజార్లు నిర్మానుష్యంగా కనిపించాయి. ఎదురుగా ఎర్రగా సూర్యుడు మండుతున్నాడు.... రెండు పిడికిళ్లలోని మట్టి కసిగా సూర్యునికేసి కొట్టాడు....

❖ ❖ ❖

ఆరు నెలలు గడిచిపోయాయి. శంకరయ్య తల్లి మూడు నెలల కిందటే జైలు నుండి విడుదలై వచ్చింది. నక్కాశాలు మాత్రం మళ్లీ చాలా రోజులదాకా శంకరయ్యకు కనిపించలేదు. ఈ ఆరు నెలల కాలంలో ఊళ్లో చాలా జరిగాయి. రెండు నెలల క్రితం ఎవరో చంద్రయ్య కాళ్లు నరికి పోయారు. పెద్దొర ఊరు విడిచి పట్నం వెళ్లిపోయాడు... ఇప్పుడు చెరువులో నిర్భయంగా ఊరివాళ్లు చేపలు పట్టుకుంటున్నారు.

ఒకనాడు సాయంత్రం శంకరయ్య పెద్ద తూముమీద కూర్చుండి గాలం నీళ్లల్లో ఆడిస్తూ ఏదో పాట పాడుతున్నాడు. ఆకాశంలో గద్దొకటి గిరికీలు కొడుతోంది. తూములో నుండి నీళు బొయ్యిన పొలాలల్లోకి పోతున్నాయి... ఎదురు కొండమీద నెమలి ఒకటి అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నది.

శంకరయ్య తలమీద చెయ్యిబడ్డది. శంకరయ్య తలెత్తాడు. ఎదురుగా నక్కాశాలు – గొంగడి కోలాటమేసుకొని నవ్వుతున్నాడు....

"బిడ్డా! బయపడ్డవా? మరింకేం బయం లేదు. మాలపంకిడిగాడు ఒడ్డున పడ్డడు... ఇషపు ఇంగిలీకంగాడు తప్పిచ్చుకపోయిండు... పైన బొమ్మెలున్నయి... గిప్పుడు ఎర్రగాలం బనికిరాదు. కప్పగాలం గావాలె- మరేం పరువలేదు మనమే గెలుత్తమ్! నువ్వు మా సంగంల కత్తవా? రాకుంటేడికి పోతవులే? ఎల్లు మీ ఎల్లు సిన్నికి జెప్పు, సోమారమత్తనని" ఆశాలు చెప్పుకపోతున్నాడు.

శంకరయ్య తెరిచిన నోరు తెరిచినట్టుగానే ఉన్నది.

"బిడ్డా! ఇగనేం బోత, శాపలుపట్ట నేర్చుకో..." ఆశాలు నిండా ముసుగు పెట్టుకొని కొండవేపు నడిచాడు.

శంకరయ్య తెరిచిన నోరు మూసుకోనేలేదు. శంకరయ్య చిన్న మెదడులో ఎన్నో ప్రశ్నలు...

ఇప్పుడా ప్రశ్నలే ముఖ్యం!

❄

అరుణతార, మాసపత్రిక జూన్ 1979